క్లుప్తంగా

శంకరమఠంలో హోమాలు

నెల్లూరు(బృందావనం): మూలాపేట శంకరమఠంలో కామాక్షి సమేత చంద్రమౌళీశ్వరస్వామి సన్నిధిలో 'కామ్యహోమ సప్తాహ మహోత్సవం'లో భాగంగా నాలుగో రోజు సోమవారం ఉదయం మహన్యాస రుద్ర ఏకాదశి హోమం, రాత్రి శివసహస్రనామ పూజలు విశేషంగా నిర్వహించారు. కంచికామకోటి పీఠానికి చెందిన పండితుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాల్లో భక్తులు పాల్గొన్నారు. మఠం నిర్వాహకులు కొర్రపాటి నందకిశోర్- ఉషాకుమారి దంపతులు పర్యవేక్షించారు.

వేడుకగా బ్రహ్మోత్సవాలు

నెల్లూరు(బృందావనం): మూలాపేటలోని శ్రీకృష్ణధర్మరాజస్వామి దేవస్థానంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం చప్పరోత్సవం, రాత్రి మల్లయుద్ధం ఉత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అర్చకుడు చక్రపాణి ఆధ్వర్యంలో వివిధ పూజలు జరిగాయి. ఉభయకర్తలుగా భీమిరెడ్డి మాల్యాద్రిరెడ్డి, పద్మ, గాలిచంద్రశేఖర్, సుభాషిణి కుటుంబసభ్యులు వ్యవహరించారు. ఈఓ జానకి పర్యవేక్షించారు.

200 మందికిపైగా రెడ్‌క్రాస్ వైద్యసేవలు

నెల్లూరు(అర్బన్): బారాషహీద్ దర్గా వద్ద రొట్టెల పండగకు వస్తున్న వారిలో సోమవారం 200 మందికిపైగా భక్తులకు రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యసేవలందించామని రెడ్‌క్రాస్ ఎంసీ మెంబర్ దాసరి రాజేంద్రప్రసాద్ తెలిపారు. రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరం రెండో రోజు కూడా కొనసాగింది. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ఎండ వేడిమికి అపస్మారకంగా పడిపోయిన వృద్ధులకు, కడుపునొప్పి, జ్వరం ఉన్న భక్తులకు వైద్యచికిత్సలు అందించామన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు నవీన్, శ్రీకాంత్, యూత్ రెడ్‌క్రాస్ కన్వీనర్ శ్రీరంజని, పీఎంపీ జిల్లా అధ్యక్షుడు శాఖవరపు వేణుగోపాల్, శేషయ్య, దేవరకొండ శ్రీనివాసులు, గౌస్‌బాషా, వెంకటసుబ్బయ్య తదితరులు ప్రథమ చికిత్స అందించారు.

బెస్ట్ డాక్టర్స్‌కు అవార్డుల ప్రదానం



నెల్లూరు(బృందావనం): పురమందిరంలో సృజన సాహితీ, సాంస్కృతిక వేదిక అధ్యక్షుడు దగ్గుపాటి రాధాకృష్ణ ఆధ్వర్యంలో 'బెస్ట్ డాక్టర్స్' అవార్డుల ప్రదానోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. నగరంలోని 16 మంది ప్రముఖ వైద్యనిపుణులను సత్కరించి అవార్డులను అందజేశారు. డీఎంహెచ్ఓ డాక్టర్ వి.సుజాత హాజరై, మాట్లాడారు. ప్రజల ఆరోగ్య సంరక్షణకు శ్రమించే వైద్యులను గుర్తించి గౌరవించడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో జిల్లా కెమిస్ట్, డ్రగ్గిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు పేరూరి ప్రదీప్, పారిశ్రామికవేత్త పి.రాధారెడ్డి హాజరయ్యారు. అవార్డులు అందుకున్న వారిలో ఎస్వీ కృష్ణారెడ్డి, కాశయ్య, ప్రభంజన్‌కుమార్, డి.మధుసూదన్, సుజాత, వైష్ణవి, అపర్ణ, భార్గవి, ఎం.సుధాకర్, నారాయణస్వామి, గణేష్‌కుమార్, గిడియన్, విజయ, గోకులకృష్ణన్, కె.శ్యాంథన్, వంకి ప్రతాప్‌కుమార్ ఉన్నారు. వ్యాఖ్యాతగా రచయిత్రి పార్లపల్లి నాగేశ్వరమ్మ వ్యవహరించారు.

విద్యుత్ భవన్ వద్ద మహా ధర్నా రేపు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): సార్వత్రిక సమ్మెలో భాగంగా ఈనెల 9న విద్యుత్ భవన్ వద్ద మహాధర్నా చేపడుతున్నట్లు ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఉపాధ్యక్షుడు దుగ్గిరాల సూరిబాబు అన్నారు. నగరంలోని సీఐటీయూ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. విద్యుత్ సంస్థలను ప్రైవేటీకరించడాన్ని, కార్మికుల హక్కులను కాలరాసేలా తీసుకొచ్చిన నాలుగు లేబర్‌కోడ్స్‌లను రద్దు చేయాలని కోరుతూ దేశవ్యాప్తంగా సమ్మె నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఇందులో విద్యుత్ కార్మికులు కూడా పాల్గొంటున్నట్లు తెలిపారు. విద్యుత్‌భవన్ వద్ద నిర్వహించే మహాధర్నాలో జిల్లాలోని విద్యుత్ కార్మికులు పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం కరపత్రాలు, పోస్టర్‌లను విడుదల చేశారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు టీవీ ప్రసాద్, హజరత్తయ్య, జాకీర్ హుస్సేన్, పెంచలప్రసాద్, గిరి, హరినారాయణ, నాగయ్య, ప్రసన్నకుమార్‌రెడ్డి, ఖాజారసూల్, శంకర్, దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

సమాధులకు ప్రార్థనలు చేస్తూ..



స్వర్ణాల చెరువులో రొట్టెలను వదిలిన తర్వాత దువా చేస్తున్న చిన్నారులు



కోర్కెలు నెరవేరాలని మొక్కుకుంటూ..





కిటకిటలాడుతున్న దర్గా..



స్వర్ణాల తీరంలో భారీ జనసందోహం

భక్తజన కోలాహలం

నగరంలోని బారాషహీద్ దర్గా భక్తజన సందోహంగా మారింది. రొట్టెల పండగ నేపథ్యంలో రెండో రోజు సోమవారం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పోటెత్తారు. కోర్కెల రొట్టెలు స్వీకరిస్తూ.. దర్గాలో ప్రార్థనలు చేశారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు

భద్రత కట్టుదిట్టం

నెల్లూరు(క్రైమ్): రొట్టెల పండగలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీస్ యంత్రాంగం భద్రతను మరింత కట్టుదిట్టం చేసింది. పండగ రెండో రోజైన సోమవారం దర్గాకు భక్తులు పోటెత్తారు. వారికి అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టారు. దర్గా ఆవరణతో పాటు పరిసర ప్రాంతాల్లో బాంబ్, డాగ్‌స్క్వాడ్‌లతో క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు. తప్పిపోయిన 31 మంది చిన్నారులను పోలీసులు సంరక్షించి వారి తల్లిదండ్రులకు అప్పగించారు. సేవాదళ్ సిబ్బంది వృద్ధులు, దివ్యాంగులకు దగ్గరుండి దర్గాదర్శనం, రొట్టెల మార్పిడి చేయించారు. ఎస్పీ కృష్ణకాంత్ పోలీసు అధికారులతో కలిసి దర్గా, స్వర్ణాలఘాట్, కమాండ్ కంట్రోల్‌రూమ్, గంధ మహోత్సవం జరిగే ప్రాంతం తదితరాలను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు, సలహాలిచ్చారు. ఏఎస్పీ సౌజన్య, డీఎస్పీలు, పోలీసు అధికారులున్నారు.

ఇష్టానుసారంగా పార్కింగ్

రొట్టెల పండగకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు తమ వాహనాలను ఎక్కడపడితే అక్కడ నిలిపివేయడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం వాటిల్లింది. దీంతో నగర వాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



దర్గా వద్ద సిబ్బందికి సూచనలిస్తున్న ఎస్పీ



శాంతినగర్‌కు వెళ్లే మార్గంలో ఏర్పడిన ట్రాఫిక్ జామ్

డ్యూటీ మధ్యలో సేదతీరుతూ..



నెల్లూరు(బారకాసు): బారాషహీద్ దర్గాలో పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహిస్తున్నారు. అయితే కొందరు పోలీసులు మాత్రం డ్యూటీ మధ్యలోనే జారుకుని వీఐపీల కోసం నగరపాలక సంస్థ ఏర్పాటు చేసిన రిసెప్షన్, మానిటరింగ్ సెంటర్ వద్ద సేద తీరుతున్నారు. కూలర్ల వద్ద విశ్రాంతి తీసుకుంటున్న వైనం సాక్షి కంటపడింది.

కమిషనర్ పరిశీలన



నెల్లూరు(బారకాసు): రొట్టెల పండగ నేపథ్యంలో బారాషహీద్ దర్గాలో సోమవారం నగరపాలక సంస్థ కమిషనర్ నందన్ విస్తృతంగా పర్యటించి పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించారు. దర్గా ప్రాంగణంలోని అన్నదాన శిబిరాల వద్ద శుభ్రత ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. సిబ్బంది కోసం భోజనాలు తయారు చేసే ప్రాంతాల్లో పరిశుభ్రమైన వాతావరణం ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ వైద్యారోగ్య శాఖ, ఇతర ప్రైవేటు ఆస్పత్రుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వైద్య శిబిరాల పరిసరాలు అత్యంత పరిశుభ్రంగా ఉండేలా నిరంతరం పర్యవేక్షించాలని శానిటేషన్ అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా స్వర్ణాల తీరంలో మహిళా భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా అన్ని జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు.

ప్రత్యేక ప్రార్థనల్లో తెలంగాణ సీజీఎం



నెల్లూరు(వీఆర్సీసెంటర్): రొట్టెల పండగ నేపథ్యంలో బారాషహీద్ దర్గాలో తెలంగాణ విద్యుత్ సంస్థ చీఫ్ జనరల్ మేనేజర్ (సీజీఎం) కె.నందకుమార్ సోమవారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా విద్యుత్‌శాఖ ఏర్పాటు చేసిన స్టాల్‌ను పరిశీలించారు. ప్రతి ఏడాది క్రమం తప్పకుండా రొట్టెల పండగకు వచ్చి ప్రార్థనలు నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. ఆయన వెంట విద్యుత్‌శాఖ టౌన్ టీఈ శ్రీధర్, ఎమ్మార్టీ విభాగపు ఈఈ లక్ష్మీనారాయణ, డీఈఈ అశోక్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి సారూ..

నెల్లూరు(క్రైమ్): క్షేత్రస్థాయిలో సమస్యలు పరిష్కారానికి నోచుకోవడంలేదని, మీరైనా విచారణ జరిపి న్యాయం చేయాలని పలువురు కోరారు. నగరంలోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి 47 మంది హాజరై తమ సమస్యలను వినతుల రూపంలో కావలి డీఎస్పీ శ్రీధర్, డీటీసీ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వరమ్మకు అందజేశారు. వీటిని పరిశీలించిన వారు, ఆయా ప్రాంత పోలీస్ అధికారులతో మాట్లాడి చట్ట పరిధిలోని సమస్యలను పరిష్కరించాలని సూచించారు. ఎస్బీ – 2 ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బాధితుల సమస్యలు తెలుసుకుంటున్న పోలీస్ అధికారులు

ఫిర్యాదుల్లో కొన్ని..

- మద్యానికి భర్త బానిసై తనను, పిల్లలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని, విచారణ జరిపి కాపురాన్ని చక్కదిద్దాలని జలదంకికి చెందిన ఓ మహిళ కోరారు.
- అదనపు కట్నం కోసం భర్త, అత్తింటి వారు వేధిస్తూ, ఇంటి నుంచి ఇటీవల గెంటేశారని, కౌన్సెలింగ్‌ను నిర్వహించి పరిస్థితిని చక్కదిద్దాలని చిన్నబజార్‌కు చెందిన ఓ వివాహిత విజ్ఞప్తి చేశారు.
- ఆరోగ్య పరిస్థితి బాగోలేకపోవడంతో పనిచేసుకోలేకపోతున్నామని, కుమారుడు వెంకటేశ్వర్లు పట్టించుకోవడంలేదని, న్యాయం చేయాలని నవాబుపేటకు చెందిన వృద్ధ దంపతులు విన్నవించారు.
- తన పేరుపై ఉన్న ఇంటిని వారి పేరుపై రాసివ్వాలని మనవడు, కోడలు చిత్రహింసలు పెడుతున్నారని, న్యాయం చేయాలని కావలికి చెందిన ఓ వృద్ధురాలు వేడుకున్నారు.
- బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగమిప్పిస్తానని నమ్మించి తిరుపతికి చెందిన జయప్రకాష్ రూ.14 లక్షలు తీసుకొని, ఆపై మోసగించారని, చర్యలు చేపట్టాలని కావలికి చెందిన ఓ వ్యక్తి అభ్యర్థించారు.
- ఆన్‌లైన్ వ్యాపారంలో అధిక లాభాలొస్తాయంటూ రూ.12.7 లక్షల పెట్టుబడులు పెట్టించి ఓ మహిళ మోసగించారని, తగిన చర్యలు చేపట్టలని కందుకూరుకు చెందిన ఓ వ్యక్తి కోరారు.
- పొలం వివాదంలో పొదలకూరుకు చెందిన శ్రీనివాసులు, అతని అనుచరులు తనపై, కుమార్తెపై దాడి చేశారని, చర్యలు చేపట్టాలని వ్యక్తి విజ్ఞప్తి చేశారు.

నిధుల విడుదలపై హామీ

నెల్లూరు (టౌన్): జిల్లాలో విద్యారంగ సమస్యలు, పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ నిధులను త్వరలో విడుదల చేస్తామని మంత్రి లోకేశ్ హామీ ఇచ్చారని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి మస్తాన్‌షరీఫ్ తెలిపారు. ఈ మేరకు సోమవారం అనిల్ గార్డెన్స్‌లో మంత్రి లోకేష్‌ను కలిశారు. శివంవర్మ పాల్గొన్నారు.

మర్యాదపూర్వకంగా..



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): వైఎస్సార్‌సీపీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా నియమితులైన వేమిరెడ్డి హంసకుమార్‌రెడ్డి రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆనం విజయ్‌కుమార్‌రెడ్డిని ఆయన నివాసంలో సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు, రూరల్ అనుబంధ సంఘాల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్‌ను సద్వినియోగం చేసుకోండి

- డీఆర్వో హుస్సేన్ సాహెబ్

నెల్లూరు(అర్బన్): చదువుకోవాలనే ఆసక్తి ఉండి రాయడం, చదవడం వచ్చిన వారు ఏపీ సార్వత్రిక విద్యాపీఠం ద్వారా ఓపెన్ స్కూల్లో చేరి పదో తరగతి, ఇంటర్మీడియట్ చదువుకోవచ్చని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి హుస్సేన్‌సాహెబ్ అన్నారు. ఇందుకు సంబంధించిన వాల్‌పోస్టర్లను కలెక్టరేట్‌లో డీఈఓ బాలాజీ రావు, సర్వశిక్ష అభియాన్ అధికారులతో కలిసి సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ 14 ఏళ్లు నిండి బడి మధ్యలో మానేసిన వారు, పదో తరగతి ఫెయిల్ అయిన వారు ఓపెన్ స్కూల్ ద్వారా పదో తరగతి పరీక్షలు రాయవచ్చన్నారు. అలాగే 15 ఏళ్లు నిండి పదో తరగతి పూర్తయిన వారు ఓపెన్ స్కూల్ ద్వారా ఇంటర్మీడియట్ చదువుకోవచ్చన్నారు. ఇలా చేరిన వారికి సెలవు రోజుల్లో మాత్రమే క్లాసులు నిర్వహిస్తారన్నారు. ఇష్టమైన ఐదు సబ్జెక్టులతో కోర్సు పూర్తి చేయవచ్చన్నారు. ఇలా చదువుకున్న వారు కూడా ఉద్యోగ అవకాశాలు పొందవచ్చన్నారు. ఆసక్తి కలిగిన వారు ఈనెల 31వ తేదీలోపు హెచ్‌టీటీపీఎస్://ఏపీ ఓపెన్‌స్కూల్.ఏపీ.జీఓవీ.ఇన్ అనే వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

ప్రమోషన్లు ఇవ్వాలని డిమాండ్

నెల్లూరు(అర్బన్): వైద్యశాఖలో డిప్యూటీ డెమో(డిస్ట్రిక్ట్ ఎడ్యుకేషన్, మాస్ మీడియా ఆఫీసర్)లకు ప్రభుత్వం ప్రమోషన్లు ఇవ్వాలని రాష్ట్ర డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ చేజర్ల సుధాకర్‌రావు డిమాండ్ చేశారు. ధనలక్ష్మీపురంలో అసోసియేషన్ కార్యవర్గ సమావేశంలో ఆయన సోమవారం మాట్లాడారు. రాష్ట్రంలో డిప్యూటీ డెమో పోస్టులు తక్కువగా ఉన్నాయన్నారు. ప్రభుత్వం ఈ పోస్టుల సంఖ్యను పెంచాలని కోరారు. అనంతరం నూతనంగా ఎన్నికైన వారిని సత్కరించారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటరమణ, నాయకులు హరిప్రసాద్, జయప్రకాష్, మంగమ్మ, వెంకటేశ్వర్లు, అనూరాధ, పద్మావతి, సుమతి, సుబ్బలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సీనియర్లకు మొండిచేయి

నెల్లూరు (పొగతోట): రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ జిల్లా పర్యటన సందర్భంగా నగరంలోని అనిల్ గార్డెన్స్‌లో సోమవారం టీడీపీ కార్యకర్తలతో సమావేశమయ్యారు. అయితే పార్టీ కోసం 30 ఏళ్లు జెండా మోసిన కార్యకర్తలను ఈ సమావేశానికి విస్మరించారు. కాగా నారా లోకేశ్‌ను కలిసేందుకు దివ్యాంగులు గంటల తరబడి ఎదురు చూడాల్సి వచ్చింది. అయితే సమావేశంలో లోకేష్ మాట్లాడుతూ పనిచేసే కార్యకర్తలకే పట్టం కడతామని చెప్పడం విడ్డూరం. కాగా ఈ సమావేశం గోప్యంగా జరగడంతో పాటు మీడియా ప్రతినిధులు, పార్టీలోని సీనియర్లకు అసలు సమాచారమే లేకపోవడం గమనార్హం.

వైఎస్సార్ జయంతికి విశేష కార్యక్రమాలు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతిని పురస్కరించుకుని నగరంలో విశేష సేవా కార్యక్రమాలు జరుగనున్నాయి. వైఎస్సార్‌సీపీ నగర నియోజకవర్గ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో గాంధీ బొమ్మ సెంటర్‌లో వైఎస్సార్ విగ్రహానికి ఉదయం 10 గంటలకు పూలమాలలు వేసి నివాళులర్పిస్తారు.

రక్తదాన శిబిరం

వైఎస్సార్ జయంతి సందర్భంగా వైఎస్సార్‌సీపీ యువజన విభాగం ఆధ్వర్యంలో సిటీ కార్యాలయంలో మంగళవారం రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు పార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు, కార్పొరేటర్ ఊటుకూరు నాగార్జున తెలిపారు. ఈ మేరకు సిటీ కార్యాలయంలో సోమవారం మాట్లాడుతూ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి సూచనలతో ఉదయం 9 గంటలకు కేక్ కటింగ్, రక్తదాన శిబిరం ఉంటుందన్నారు.

రొట్టెల పండగకు ప్రత్యేక బస్సులు

నెల్లూరు (పొగతోట): బారాషహీద్ దర్గా రొట్టెల పండగ సందర్భంగా వివిధ ప్రాంతాలకు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసినట్లు ఏపీఎస్ఆర్టీసీ అధికారి షమీమ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏఎస్‌పేటకు 20, కసుమూరుకు 20 బస్సులు నెల్లూరు నుంచి నడుపుతున్నట్లు తెలియజేశారు. నగరంలోని ప్రధాన రైల్వేస్టేషన్ నుంచి బారాషహీద్ దర్గాకు ఆరు బస్సులు నడుపుతున్నామన్నారు. నెల్లూరు నుంచి చెన్నైకి 4, బెంగళూరుకు 4, కడపకు 4, తిరుపతికి 5, ఒంగోలుకు 5, విజయవాడకు 10, హైదరాబాద్‌కు 4 స్పెషల్ బస్సులు రొట్టెల పండగకు వచ్చే భక్తుల సౌకర్యార్థం నడుపుతున్నామని వివరించారు.

పూలే బీసీ భవన్‌ను పూర్తి చేయాలి

నెల్లూరు(అర్బన్): నగరంలో పునాదులకే పరిమితమైన జ్యోతిరావు పూలే బీసీ భవన్‌ను తక్షణమే పూర్తి చేసేలా అధికారులు తీసుకోవాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.శ్రీనివాసయాదవ్, రావులపల్లి వెంకటజ్యోతి డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో వారు సోమవారం కలెక్టర్ ఆనంద్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ గత టీడీపీ హయాంలో బీసీ భవన్‌ను నిర్మించేందుకు ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసిందన్నారు. పునాదులు వేసి పిల్లర్స్‌ను నిర్మించారన్నారు. ప్రస్తుతం ఆ ప్రాంతమంతా కంపచెట్లతో అడవిని తలపించేలా ఉందన్నారు. తమ సంఘం తరఫున సొంత నిధులు వెచ్చించి జంగిల్ క్లియరెన్స్ చేసి చదును చేసి ఇస్తామన్నారు. అందుకు అధికారులు అనుమతి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం బీసీ భవన్ నిర్మాణాన్ని పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వితపు లలితారామ్, నాయకులు పెయ్యల పవన్‌కుమార్‌యాదవ్, అపర్ణ, సోమా గోపాల్, రాధా తదితరులు పాల్గొన్నారు.

ఉలికిపడిన జిల్లా

నెల్లూరు నగరంలో మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఇంటిపై టీడీపీ గూండాలు సోమవారం రాత్రి జరిపిన దాడి నేపథ్యంలో నెల్లూరు జిల్లా ఒక్కసారిగా ఉలికిపడింది. గతంలో ఎన్నడూ లేని విధంగా దాదాపు 70 మందికి పైగా టీడీపీ మూకలు ప్రసన్న ఇంటిపై పడ్డారు. విచక్షణ కోల్పోయి ఇంటి ఆవరణలో నిలిపిన కారును ఒక్కసారిగా పైగా లేపి ధ్వంసం చేశారు. అనంతరం ఇంట్లోకి వెళ్లి కంటికి కనిపించిన సామగ్రిని ధ్వంసం చేస్తూ బీభత్సం సృష్టించారు. అడ్డొచ్చిన వారిపై దాడికి పాల్పడుతూ స్వైర విహారం చేశారు. ఘటన తర్వాత ఇంటి ప్రాంగణంతో పాటు లోపల భయానక వాతావరణం నెలకొంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్ నెల్లూరు



ప్రసన్న ఇంటి వద్దకు భారీగా తరలివచ్చిన అభిమానులు



ప్రసన్నను ఫోన్‌లో పరామర్శిస్తున్న జగన్



ప్రసన్న ఇంట్లో విధ్వంసాన్ని పరిశీలిస్తున్న పోలీసులు



టీడీపీ మూకల దాడిలో ధ్వంసమైన ఫర్నిచర్